www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
చిత్తూరు

తిరువణ్ణామలై చేరిన 'సైకిల్‌యాత్ర'

వేలూరులో ...

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుపతి నుంచి మధురైకి బయల్దేరిన మతసామరస్య సిపిఎం సైకిల్ యాత్ర తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి సోమవారం రాత్రికి చేరుకుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ యాత్ర చిత్తూరు, వేలూరు జిల్లాల మీదుగా 200 కిలోమీటర్లు సాగింది. మండుటెండలో సీనియర్ కామ్రేడ్లు చల్లా వెంకటయ్య, కుప్పస్వామి చేస్తున్న ఈ యాత్రకు అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. పార్టీ అభిమానులు, కార్యకర్తలు వారికి జెండాలతో స్వాగతం పలుకుతున్నారు. వేలూరు సిపిఎం జిల్లా కార్యదర్శి శంకరి, కార్యదర్శివర్గ సభ్యులు దయానిధి ఘనంగా యాత్రకు స్వాగతం పలికి, శాలువతో సత్కరించారు.

ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ

జిల్లాలో 2,65,067 మందికి రూ. 112.79 కోట్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఏప్రిల్ 1వ తేదీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీకి సంబంధించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా ఏప్రిల్ ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే ఉదయం 7గంటల నుంచి పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 2,65,067 మంది ఫించన్ దారులకు రూ.112.79 కోట్లు పంపిణీ చేయాలని, 1వ తేదీనే వంద శాతం పంపిణీ చేసేలా అధికారులు అందరూ చర్యలుతీసుకోవాలన్నారు. ఫించన్ పంపిణీదారులకు మొదటి 4 గంటలలోపు పంపిణీ పూర్తిచేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఎక్కడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ పారదర్శకంగా పకడ్బందీగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత నెలలలో వివిధ కారణాలతో ఫించన్ తీసుకొని వారికి ఈ నెలలో మొత్తం ఫించన్ పంపిణీ చేయబడునన్నారు. ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు పగడ్బందీగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

గడ్డి 'గిరాకీ'

పశుగ్రాసం ధరలతో బెంబేలు

ట్రాక్టర్ గడ్డి రూ.15వేల పైమాటే

పశుపోషకందారుల ఆవేదన

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్

గ్రామాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ పంటలు పండించడానికి సాగుభూమి ఉండదు. కొంతమంది రైతులకు మాత్రమే ఎంతో కొంత భూమి ఉంటుంది. ఆ భూమిలో కూడా సాగు చేయడానికి రైతులు పడే కష్టాలు వర్ణనాతీతం. భూమి ఉన్న రైతులకు సాగునీరు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. తీరా కష్టపడి పండించిన పంటలను అమ్మడానికి పోతే గిట్టుబాటు ధరలు ఉండవు. పంటలు పండించే రైతులు పరిస్థితి చూస్తే ఇలా ఉంటే సాగు భూమిలేని రైతులు చాలామంది ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది పశువుల పెంపకం మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఈ పశువుల పెంపకం వలన వచ్చే డబ్బులతోనే చాలీచాలని బతుకును వెల్లదీస్తున్నారు. ఈ చాలీచాలక వచ్చే డబ్బులతో కుటుంబ పోషణ, వారి పిల్లలను చదివించుకోవడం పశువుల పోషక దారులకు ఎంతో ప్రయాసతో కూడిన పని. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మార్చి మాసంలోనే భానుడి ప్రతాపం తీవ్రంగా ఉంది. పాడి రైతులు వారి గ్రామాల సమీపంలో ఉన్న ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులు మేత మేయడానికి తిప్పుతుంటారు. ఎండల ప్రభావం ఎక్కువ కావడంతో ఎక్కడా పచ్చగడ్డి కనపడే దాఖలాలు కనపడటం లేదు. దీంతో పాడి రైతులు పశువుల మేత కోసం వరిగడ్డిని తప్పక కొనాల్సిందే. వరిగడ్డి ధర ఏటేటా పెరిగే పరిస్థితి కానీ తగ్గిన పరిస్థితి కనబడటం లేదు.

మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. మండలం మొత్తం మీద ఆవులు 19,216, బర్రెలు11,383, గొర్రెలు42,983, మేకలు12,216 ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం ఒక ట్రాక్టర్ వరి గడ్డి ధర సుమారు పదివేల రూపాయలు ఉంటే ఈ సంవత్సరం సుమారు 15 వేల రూపాయలు పలుకుతుంది. ఈ విధంగా ఏటేటా వరి గడ్డి ధరలు పెరుగుతూ ఉండటంతో పశు పోషక దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక ఎకరా పొలంలో వరిగడ్డి కొనాలంటే ఒక ఎకరాకు రైతుకు మూడు వేల నుంచి 4000 రూపాయలు, గడ్డిని మిషన్ ద్వారా కట్టలు కట్టించడానికి ఒక కట్టకు 25 రూపాయలు, ట్రాక్టర్ బాడుగ కిలోమీటర్ల లెక్కన, పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్లు ఎక్కించి తిరిగి పాడి రైతు ఇంటి దగ్గర వాము వేయడానికి కూలీలకు సుమారు 3000 నుంచి 4000 రూపాయలు ఖర్చు అవుతుందని పాడి రైతులు చెబుతున్నారు. తౌడు 30 కేజీలు 900 రూపాయలు, పెసర పొట్టు 50 కేజీలు 1600 రూపాయలు, క్యాల్షియం క్యాను 1200 రూపాయలు చొప్పున కొని పశువులకు మేతగా అందించడం ఎంతో కష్టంగా మారిందని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరల వలన కొన్ని గ్రామాల్లో పశువులను పోషించి వాటి ద్వారా వచ్చే ఆదాయం సరిపోక కూలి పనులకు వెళ్లిన పరిస్థితులు లేకపోలేదు.

పశుపోషణతో పాటు కూలికెళ్లాల్సిందే

పశు పోషక దారుడు టి.మునిస్వామి, ఎగువ వీధి

గతంలో పశువుల పెంపకం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునే వాళ్ళం. కానీ ఇప్పుడు పెరిగిన ధరలతో పశువులను పోషించడం చాలా ఇబ్బందిగా మారింది. మేతల ధరలు విపరీతంగా పెరగడం, పాలు ధరలు పెరగకపోవడంతో ఎన్నో వ్యయ ప్రయాసల మధ్య జీవిస్తున్నాము. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పశువులకు అందించే మేతలను సబ్సిడీ ద్వారా అందించాలని కోరుతున్నాము.

పశువులకు పుష్కలంగా నీరు తాగించాలి : రవీంద్రవర్మ, పశువైద్యాధికారి

వేసవికాలంలో పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తొండమనాడు పశు వైద్యాధికారి రవీంద్ర వర్మను వివరణ కోరగా వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత వలన పశువులు బరువు తగ్గడం జరుగుతుంది. అలా జరగకుండా ఉండాలంటే పాడి రైతులు పశువులకు ఎక్కువగా నీరు తాగించాలి. అలాగే పచ్చిగడ్డి, దాణాలను మామూలు కంటే ఎక్కువ శాతం మేతగా అందించాలి. ఎండల వలన పశువుల్లో ఏదైనా మార్పులు కనిపిస్తే వెంటనే పశువైద్యశాల అధికారుల సూచనల మేరకు మందులు వాడాలి.

దళితులకు భూములు పంచాలి : కెవిపిఎస్


కెవిపిఎస్ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో భూమిలేని దళిత కుటుంబాలకు భూములు పంచాలని, జిల్లాలో ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు అరికట్టలేని పరిస్థితి ఉందని, వెంటనే దాడులు ఆపి రక్షణ కల్పించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎన్‌డి శ్రీనివాసులు అధ్యక్షతన కెవిపిఎస్ జిల్లా మహాసభ జరిగింది. నల్లప్ప మాట్లాడుతూ కెవిపిఎస్ దళితుల పక్షాన పోరాడుతుందని, దళితుల మధ్య చీలిక తెచ్చేలా పాలకులు అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లాలో నేటికీ కులవివక్ష విలయతాండవం చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దళితులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. దళితవాడల్లో ఇప్పటికీ శ్మశానాలు లేవన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ప్రైవేట్‌రంగంలోనూ దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని, టిటిడిలో, కార్పొరేషన్‌లో, ఇతర డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ సభలో కెవిపిఎస్ నాయకులు ఆర్.వెంకటేష్, అరుణాచలం, సంక్రాంతి వెంకటయ్య, పాకాల మధు, ఎన్.రఘు, చిరంజీవి, ప్రభాకర్, ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్లు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వానికి దివ్యాంగుల పెన్షనర్ల సంఘాలు విజ్ఞప్తుల మేరకు సదరం వెరిఫికేషన్‌తో పాటు స్లాట్లను తిరిగి ప్రారంభించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేయుటకు ఈనెల 1వ తేదీ మంగళవారం నుంచి ఈసేవలు అమల్లోకి వస్తాయని డిసిహెచ్‌ఎస్ డాక్టర ప్రభావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్లాట్లు ఏరియా ఆసుపత్రి, పలమనేరులో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, దేవాదాయ ధర్మాశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఉగాది మహోత్సవ వేడుకలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వేదపండితులు చిలకమర్తి వెంకటసుబ్బారావు పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని, అభివృద్ధి చేయాలని తెలిపారు. ఎస్పీ, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుకున్నారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న పండితులను ఘనంగా సన్మానించారు. డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, సమగ్రశిక్ష ఏపిసి వెంకట రమణ, జిల్లా దేవాదాయశాఖ అధికారి చిట్టెమ్మ, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, టూరిజం మేనేజర్ గౌరీ, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ మృతి

ఆచార్య తుమ్మల రామకృష్ణ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ సోమవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆయన సోమవారం తుది శ్వాస విడిచారు. 2019-22 వరకు ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందించిన ఆయన తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి తెలుగులో పిహెచ్‌డి పూర్తి చేయడం జరిగింది. ఆధునిక సాహిత్యం, కవిత్వం, సృజనాత్మక రచన, కల్పన, పాఠ్యపుస్తకాల తయారీ ఆయనకు ఉన్న ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. ఆయన పరిశోధనా పుస్తకాలను సైతం ప్రచురించడం జరిగింది. ఆయన మరణం పై పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

క్యూబాకు ప్రగతినగర్ వాసుల సంఘీభావం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: క్యూబా దేశాన్ని ఆర్థికంగా అమెరికా దేశం ఇబ్బందులకు గురిచేస్తుంది. క్యూబాను ఆదుకోవడం కోసం ప్రజల నుండి విరాళాలు సేకరించాలని సిఐటియు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం పగతి నగర్ లో విరాళాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మీ మాట్లాడుతూ క్యూబాలో కమ్యూనిస్టుల నేతత్వంలో సోషలిస్ట్ వ్యవస్థ కొనసాగుతోందని, దీన్ని జీర్ణించుకోలేని అమెరికా అనేక రకాల ఆంక్షలు విధించినప్పటికీ అగ్రగామి దేశంగా ఉన్న అమెరికాకు బెదరకుండా ప్రజలకు పాలన అందిస్తున్నారని తెలిపారు. క్యూబా లో నేటికీ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. క్యూబాకు అండగా నిలబడడానికి 95 ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయని అన్నారు. విరాళాలు ఇచ్చిన వారికి ఆర్.లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

శివయ్యా.. ప్రసాదం ఏదయ్యా..!

చలువ పందిళ్లకు 'ముందు'చూపేది..?

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీకాళహస్తీశ్వర ఆలయం ప్రసిద్ధిగాంచిన యాత్రాస్థలం. రాహుకేతు పూజలకు ఇక్కడ నెలవు. రోజుకు 40-50వేల మంది భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుంటారు. కార్తీకమాసం, శివరాత్రి, సోమవారాల్లో ఆలయం కిక్కిరిసి ఉంటుంది. ఏటా రూ.200 కోట్ల ఆదాయం ఆలయానికి వస్తుంది. రాహుకేతు పూజలే పెద్ద ఆదాయ వనరు. తిరుమలలో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి ఆలయం మూసేంత వరకూ శ్రీవారి ప్రసాదాన్ని భక్తులకు అందిస్తూనే ఉంటారు. అయితే రూ.200 కోట్ల పైనే ఆదాయం వస్తున్న శ్రీకాళహస్తిలో భక్తులకు ఉచితంగా కప్పు ప్రసాదం ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. భక్తుడు ఈశ్వరుని దర్శించుకున్న తరువాత తీర్థంతో పాటు, శఠగోపం, ప్రసాదం ఆశిస్తాడు. అయితే శ్రీకాళహస్తి ఆలయంలో అలా లేదు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటలకల్లా ప్రసాదం ముగించేస్తారు. మళ్లీ సాయంత్రం గంటసేపు అందిస్తారు. ఆ మధ్యలో వచ్చిన భక్తులకు మాత్రమే ప్రసాద ప్రాప్తం. మిగిలిన వారికి లేనట్లే. అయితే మిగతా సమయాల్లో వచ్చిన భక్తులు సెంటిమెంట్‌గా ఫీలవుతున్నారు. కనీసం స్వామివారి ప్రసాదానికి తాము నోచుకోమా? అని మొహం మీదనే అడిగేస్తుండటం గమనార్హం. లడ్డూ, వడ, బెల్లం పొంగలి, జిలేబి, పులిహోర మాత్రం విక్రయానికి పెట్టారు. ప్రసాదం కావాల్సిన వారు కొనుక్కుని తినాల్సిందే.

ఏప్రిల్ నెలలో చలువ పందిళ్లు వేస్తూ..

'చలువ పందిళ్లకు' ముందుచూపు లేదా..?

సహజంగా వేసవి కాలం మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలని అనుకుంటాం. అయితే గత పదేళ్లుగా తూర్పు మండలాల్లో వేసవి తీవ్రత ఫిబ్రవరి నుంచే మొదలై వడగాల్పులు ఉంటున్నాయి. ఈలోపే మార్చి నెలలో శివరాత్రి సైతం పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వేడుకగా జరుపుకున్నారు. అయితే తూర్పు మండలాల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాలుగు నెలల పాటు చలువ పందిళ్లు ఉంటే భక్తులు సేదతీరేందుకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే శ్రీకాళహస్తీశ్వర ఉన్నతాధికారులు ఏప్రిల్ నెలలో చలువ పందిళ్లు వేసేందుకు పూనుకోవడం గమనార్హం.

భక్తిశ్రద్ధలతో రంజాన్

చిత్తూరు నగరంలోని గిరింపేట ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

(వార్తలు 6వ పేజీలో)

అలిపిరి టోల్ గేట్‌లో వ్యక్తి హల్చల్

అన్యమతస్థుడి రాకపై టిటిడి విజిలెన్స్ ఆరా

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల అలిపిరి చెక్ పాయింట్ దగ్గర ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. చెక్ పాయింట్ వద్ద బైక్ ను ఆపకుండా తప్పించుకుని తిరుమల వైపు దూసుకెళ్లాడు. అమీర్ అంజాద్ ఖాన్ అనే అన్యమతస్థుని నిలువరించేందుకు భద్రతా సిబ్బంది చాలా ప్రయత్నించారు. కానీ అతను వేగంగా దూసుకెళ్లాడు. అంతేకాకుండా ఘాట్ రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్‌తో వెళ్లడంతో పలు వాహనాలను ఢీకొట్టాడు. అతన్ని జీఎన్సీ టోల్ గేట్ వద్ద విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అలిపిరి నుంచి తిరుమల వరకు ఓ సాధారణ వ్యక్తి తన బైక్ పై వెళ్తుంటే అతన్ని అదుపులోకి తీసుకునే వ్యవస్థ టీటీడీ వద్ద లేకపోవడం తిరుమలలో ఉన్న భద్రతా డొల్లాతనాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. రంజాన్ వేడుకలు జరుగుతున్న టైమ్ లో ఓ అన్యమతస్థుడు తిరుమల వైపు దూసుకెళ్లడం వెనుక ఏమైనా కారణం ఉందా అని ఆరా తీస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

నేడు గౌహార్ సుల్తానా ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

ఉపాధ్యాయ వృతి ఉన్నతమైనదని, విద్యార్థులకు చదువు చెప్పి వారి భవిష్యత్తుకు బాటలు వేస్తూ తీర్చిదిద్దం చాలా సంతృప్తినిచ్చిందని బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌహార్ సుల్తానా తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయి నుంచి ప్రధానోపాధ్యాయులుగా ఎదిగిన వైనం ఆమె మాటల్లో..


గౌహార్ సుల్తానా దంపతులు

నేడు మహమ్మద్ హుస్సేన్ సలీమాలకు 1963 ఆగస్టు 13వ తేదీన పుట్టాను. మా తండ్రి తిరుపతి తిరుమల దేవస్థానములో ఉద్యోగం చేస్తూ 2021 జూన్ 30వ తేదీన పదవీ విరమణ పొందారు. మేం మొత్తం నలుగురం ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. 1973లో తిరుపతి లోని మాలవ్యాజి మున్సిపల్ పాఠశాలలో 5వ తరగతి, శ్రీ పద్మావతి బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదివాను. 1978- 1980 శ్రీపద్మావతి మహిళా కాలేజీలో ఇంటర్, బీఎస్సీ (సిపిజెడ్) పూర్తి చేసి డిగ్రీ పట్టా పొందాను. 1984లో నెల్లూరులోని కాంప్రహెన్షన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్స్‌లో ఫిజిక్స్, ఇంగ్లీష్ మెథడాలజీ బీఈడీ పూర్తి చేశాను. చదువు పూర్తి అయిన తరువాత 1990 ఫిబ్రవరి 11న ఉపాధ్యాయులు ఎం.మస్తాన్‌తో నాకు వివాహం జరిగింది. మాకు ఇద్దరు పిల్లలు కూతురు, కొడుకు. పిల్లలు ఇద్దరూ బీటెక్ పూర్తి చేశారు. మా అమ్మాయి సుల్తానా ఆమె భర్త ఎస్. రిజ్వాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇక మా కొడుకు నీలమంగళంలో కెనరా బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్నాడు.

మొదటిసారిగా 88లో రేణిగుంట మండలం ఎంపిపిఎస్ మొలగమూడి పాఠశాలలో స్పెషల్ టీచర్‌గా చేరాను. 89లో కె.వి పల్లి మండలం సీతారామపురం పాఠశాలకు బదిలీ అయ్యాను. 1991 నుండి 2001 వరకు చిన్నగొట్టిగల్లు మండలంలోని కొమ్మిశెట్టిగారి పల్లె పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పాను. అదే సంవత్సరం డిసెంబర్ 19న ఫిజికల్ సైన్స్‌లో పదోన్నతి పొంది 2005 వరకు చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట జెడ్‌పి హెచ్‌ఎస్‌లో పాఠశాలు చెప్పాను. 2015-2021 వరకు బోడెవాండ్లపల్లి ఎర్రవారిపల్లెలోని జెడ్‌పిహెచ్‌ఎస్‌లో అనంతరం ఉద్యోగ్యోన్నతి పొంది గుర్రంకొండ మండలంలోని మర్రిపాడు ఉర్దూ జెడ్‌పి హెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించాను. అక్కడి నుంచి 2021లో బైరెడ్డిపల్లి బాలికల జిల్లా ఉన్నతపాఠశాల సిఆర్‌సి హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించాను. మూడు సంవత్సరాల 11 నెలలపాటు ఈ పాఠశాలకు సేవలందించి ఏప్రిల్ 1వ తేదీన ఉద్యోగ విరమణ పొందుతున్నారు. గత 37 సంవత్సరాలుగా టీచర్‌గా, ప్రిన్సిపల్‌గా ఎంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిద్దిడంలో, వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేయడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. అందుకే అంటారు ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని..


గౌహార్ సుల్తానా కూతురి కుటుంబం

తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ రాజేశ్వరిపెద్దిరెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం సంతబైలులో తాగునీటి సమస్యను ఎంపీపీ బండి నాగ హేమ సుందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బట్టే రమణ సుబ్రహ్మణ్యం మండల నిధులతో స్థానిక సర్పంచ్ రాజేశ్వరి పెద్దిరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం బోరు ఏర్పాటు చేసి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారని స్థానిక నాయకులు తెలిపారు. ఎంతో కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంతో తమ గ్రామంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

ఎస్ఐ సుమన్‌ను సన్మానిస్తున్న హ్యూమన్ రైట్స్ సభ్యులు

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్లో ఉగాది సందర్భంగా జాతీయ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు ఢిల్లీ బాబు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ సభ్యులు ఎస్ఐ సుమన్ ను పూల మాలతో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఏవైనా సమస్యలుంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అందులో హ్యూమన్ రైట్స్ సభ్యులు ముందుంటామని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాలకృష్ణయ్య, చంద్రశేఖర్, వెంకటముని, మండల డైరెక్టర్ శాంతి కుమార్, సభ్యులు ప్రభాకర్ ఆలీ అబ్బాస్, జవహర్ పాల్గొన్నారు.

వెండి కిరీటాలు వితరణ

వెండి కిరీటాలు వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట శ్రీ కోదండరామస్వామికి సీతమ్మ ఆలయానికి చెందిన గల్లా రెడ్డప్పనాయుడు, గల్లా రెడ్డమ్మ కుటుంబ సభ్యులు 1లక్షా30 వేల రూపాయలు విలువైన వెండి కిరీటాలను ఆలయ ధర్మకర్తలు కొల్లా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో గల్లా ధనుంజయ నాయుడు, గల్లా బోసు, మాన్యం శివయ్య నాయుడు, చంద్రశేఖర నాయుడు, గల్లా ధను, సతీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వయం కృషి ఆయుధం..సంకల్పమే పట్టుదల

ఓ శతాధిక వృద్ధుడి ఆరోగ్యం

ప్రజాశక్తి- యాదమరి: ప్రస్తుతం యువ కులు సైతం తమ పనులు తాము స్వయంగా చేసు కోలేని దుస్థితిలో ఉన్న ఈ కాలంలో వంద సంవత్సరాలు దాటి నా తన పనులు తానే చేసుకుంటూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం కృషి తన ఆయుధంగా చేసుకుని సంకల్పమే తన పట్టుదలగా మలుచుకుని వందేళ్ల దాటినా జీవిస్తూ ఆరోగ్యంతో తనకు తానే ముందుకు సాగుతున్నాడు ఓ వృద్ధుడు.. చిత్తూరు జిల్లా యాదమరి మండలం ఎర్రజేను గ్రామంలో దేమాలి కృష్ణారెడ్డి, దేమాలి చిన్నక్కలు భార్యాభర్తలు. కృష్ణారెడ్డి భార్య చిన్నక్క గత 22 సంవత్సరాల క్రితం మృతి చెందారు. అప్పటి నుండి తన పనులు తానే స్వయంగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని బంధువులు తెలిపారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయిపోయి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటికే దేమాలి కృష్ణారెడ్డి వందేళ్లు పూర్తి చేసుకుని మూడు తరాల సంతతిని చూడడం విశేషం. వందేళ్లు పూర్తి చేసుకున్న కృష్ణారెడ్డికి కుమారులు, కుమార్తెలు, మనవలు మనవరాళ్లు మొత్తం కుటుంబ సభ్యులు కలిసి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం వందేళ్లు పూర్తి అయినా కృష్ణారెడ్డి ఇప్పటికీ ఆరోగ్యంగా తన పనులు తానే చేసుకుంటూ ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా జీవించడం ఇటు కుటుంబ సభ్యులకు, అటు బంధుమిత్రులకు, గ్రామస్తులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

కృష్ణయ్యకు అంబేద్కర్ పురస్కారం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాలకు బంగారు పాళ్యం మండలం మహా సముద్ర గ్రామానికి చెందిన కృష్ణయ్య ఎంపిక య్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన ఉగాది పర్వదినాన జై భీమ్ దళితులకు అందించిన సేవల కు గుర్తింపుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారం రాష్ట్ర రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు ఆధ్వర్యంలో అవార్డును అందుకున్నట్టు ఆయన తెలిపారు.

అంబేద్కర్ పురస్కారం అందుకుంటున్న కృష్ణయ్య

దాతల సాయంతో నిర్మించిన పాఠశాల భోజనశాల

3న పాఠశాల భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం పత్తికొండ గ్రామం జిల్లా పరిషత్ హై స్కూలులో కొద్దిమంది విరాళాలతో నిర్మించిన భోజనశాలను. ఈ నెల 3వ తేదీ ఉదయం10 గంటలకు ప్రారంభించనున్నట్లు శ్రీపురం సీతారామయ్య, సేగు రాజప్ప పేర్కొన్నారు.సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ భోజనశాల నిర్మాణానికి సహకరించిన విరాళ దాతలందరూ ప్రారంభోత్సవానికి రావాలని కోరారు. అదే రోజు ఉదయం 10 గంటలకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని, అనంతరం 12 గంటలకు దాతలకు , డాక్టర్లకు ఉపాధ్యాయులకు భోజనం ఏర్పాటు చేస్తామని, విరాళ దాతలు తప్పక హాజరై ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి

ముస్లింల నిరసన

ప్రజాశక్తి- రొంపిచర్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రొంపిచర్ల మండలం బండ కింద పల్లిలోని ముస్లిం ఐక్యవేదిక మైనారిటీ సభ్యులు స్థానిక జామియా మసీదు వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా ఈద్గా మైదానం వద్దకు చేరు కున్నారు. వక్ఫ్ బోర్డుకు సంబంధిం చిన ఆస్తులను పరిరక్షించి, సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు పాల్గొ న్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన తెలుపుతున్న ముస్లిం సోదరులు

నివాళులర్పిస్తున్న ఎంసి విజయానందరెడ్డి

నాంచారమ్మకు నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త నాంచారమ్మ మృతి వైసిపికి తీరని లోటని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేర్కొన్నారు. నాంచారమ్మ అనారోగ్యంతో సోమవారం ఉద యం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న విజయా నంద రెడ్డి ఆమె మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్ని వేళలా కుటుంబానికి అండగా ఉంటారని, ధైర్యంగా ఉండా లని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆయనతో పాటు మాజీ స్థానిక సర్పంచ్ విజయబాబు, గోవింద రెడ్డి ,రమేష్ సంపత్ , రాము, కనిక రాజు, అదిశయరాజు, సాము, యుగంధర్, పండయ్య, గంగయ్య మోసెస్, కృష్ణయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

ఉగాది సందర్భంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్

ప్రజాశక్తి -శాంతిపురం: ఉగాది పండుగ సందర్భంగా బెండను కుప్పం గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన (బిపిఎల్)బెండనకుప్పం ప్రీమియర్ లీగ్‌లో సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బెండనకుప్పం టైటాన్స్ టీం కెప్టెన్ అనిల్ కుమార్ సారథ్యంలో వైస్ కెప్టెన్ అజయ్ కుమార్, ఆటగాళ్లు కార్తీక్, ఉదయ్, తేజు, సాజన్, శివ ప్రసాద్, శ్రీహరి, కేతన్ విగ్నేష్, అఖిల్, లప్పీ బాబు తమ ప్రత్యర్థి టీం, బెండన కుప్పం బుల్స్ జట్టుపై ఘన విజయం సాధించి ట్రోఫీని అందుకున్నారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్లుగా బెండన కుప్పం గ్రామానికి చెందిన యువకులు అజయ్ కుమార్, సురేష్ టోర్నమెంటు ను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చక్కగా నిర్వహించారు. ఈ ట్రోఫీని రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా టీం ఓనర్ బాబు చంద్ర నాయుడు అందుకొని టీం కెప్టెన్, టీమ్ మెంబర్స్‌కు అందించాడు. బెండన కుప్పంలో ఉన్న యువకులందరూ కలిసి నాలుగు జట్లుగా ఏర్పడి ఈ బిపిఎల్ టోర్నమెంట్లో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి విశేషంగా ప్రజలు ఈ టోర్నమెంట్‌ను వీక్షించారు. టోర్నమెంట్లో విశేష ప్రతిభ కనబరిచిన కార్తీక్ రాళ్ళబూదుగూరు ఎస్ఐ చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందుకున్నారు. ఈ టోర్నమెంట్ విజేతగా బెండనకుప్పం టైటాన్స్ టీం విజయం కెప్టెన్ అనిల్ కుమార్ సారథ్యంలో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకున్నారు.

బోయ సంఘం రాష్ట్ర యూత్ వింగ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వర్

ప్రజాశక్తి -సోమల: రాష్ట్ర ఐ పవర్ కమిటీ సోమల మండలం నెల్లిమంద పంచాయతీకి చెందిన నక్క ఈశ్వర్‌ని మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర యూత్ వింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిస్తూ సోమవారం నియామక పత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ వాల్మీకి హక్కుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు.

ఉగాది కానుకలు పంపిణీ

ప్రజాశక్తి- రొంపిచర్ల: పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శివ రెడ్డి, వంకిరెడ్డి చరణ్ రెడ్డి 500 కుటుంబాలకు ఉగాది కానుకలు సోమవారం పంపిణీ చేశారు. టిడిపి యువ నాయకులు వంకిరెడ్డి చరణ్ రెడ్డి తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన 500 కుటుంబాలకు తన వంతు కృషితో ఉగాది కానుకలు పంపిణీ చేశారు. చల్లా రామచంద్రారెడ్డి అండ దండలతో మరెన్నో కార్యక్రమా లకు శ్రీకారం చుడుతూ పంచాయతీలో ఎలాంటి కార్యక్రమాలైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వంకిరెడ్డి చరణ్ రెడ్డి తెలిపారు. యువత రాజకీయాల్లోకి ముందుకు రావాలని పార్టీ ప్రతి ఒక్కరిని గుర్తించుకునేలా చూస్తామని పార్టీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా వంకిరెడ్డి చరణ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శివారెడ్డి, లోకనాథ్ రెడ్డి, హర్ష రెడ్డి, యతీష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వినోద్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు

డాక్టర్ శారద సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -పలమనేరు: ప్రభుత్వ డాక్టరు శారద సేవలు అభి నంద నీయమని ఎమ్మెల్యే ప్రశంసిం చారు. పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శారదమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరై ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణా రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆసుపత్రి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్, మంజుల, టీడీపీ నాయకులు బ్రహ్మయ్య, గిరి, కోటి మరియు ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పలువురికి ఉగాది పురస్కారాలు

పురస్కారం అందుకుంటున్న తులసినాథంనాయుడు

పురస్కారం అందుకుంటున్న పద్మనాభం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని ఆరి మాకుల పల్లి గ్రామా నికి చెందిన పైనేని చిన్న బుచ్చినాయుడు కుమారు డు తులసినాథం నాయుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ఇచ్చే ఉగాది పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఆదివారం విజయవాడలో ఆయన అందుకున్నారు. గ్రామీణ ప్రాంతం లో రైతు కుటుంబంలో జన్మించిన ఈయన ఉపాధ్యా యుడిగా పలమనేరులో స్థిరపడ్డారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని స్థాపించి గ్రామీణ ప్రాంత పాఠశాలలలో విద్యార్థులకు బోధిస్తూ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి భాషాభివృద్ధికి దోహదం చేస్తున్నారు. ఇప్పటి వరకులక్షా అరవై వేల పుస్తకాలు ఉచితంగా పంచి పెట్టారు. సొంతంగా కళామందిరం నిర్మించి నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తూ, తెలుగు భాషా రక్షణే శ్వాసగా జీవిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పైనేని తులసినాథం నాయుడుకి ఉగాది పురస్కారం అందించింది. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప, కోశాధికారి పైనేని మురళి పాల్గొని అభినందనలు తెలిపారు.

రామకుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది వేడుకల సందర్భంగా డోలు విద్వాంస కళాకారుడు పద్మనాభం కళారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం ఉగాది వేడుకల్లో రామకుప్పం మండలం, బందార్లపల్లి గ్రామానికి చెందిన పద్మనాభం ఈ అవార్డు అందుకున్న ఆయనకు మండల టిడిపి నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పశువైద్యాధికారిణి చందన ప్రియ

సోమల: సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి పశువైద్యాధి కారిణి మారసాని చందన ప్రియ పశుసంవర్ధక శాఖలో విధుల నిర్వహణలో మెరుగైన సేవలు అందించి నందుకు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం అవార్డుకు ఎంపిక అయ్యారు. వల్లి గట్ల రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకుడు మహేష్ సైతం అవార్డుకు ఎంపికైనట్లుగా సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ఈ అవార్డును ఏప్రిల్ రెండవ తేదీ విజయవాడలో అందు కోనున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: చదువుతో పాటు క్రీడల్లో యువకులు రాణిస్తే ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత లభిస్తుందని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ పొన్న యుగంధర్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో తూగుండ్రం పంచాయతీ జనసేన అధ్యక్షుడు రిజ్వానా, నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనారిటి ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్న మెంట్‌ను సోమవారం పొన్న యుగంధర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా యువకులు శారీరక దృఢత్వం పొందాలంటే క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతా యన్నారు. ఈ టోర్నమెంట్‌లో రెండు రోజుల పాటు 12 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూగుండ్రం పంచాయతీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజా క్షులురెడ్డి, మండల టిడిపి మైనార్టీ ప్రధాన కార్యదర్శి అత్తెహార్, మండల జనసేన అధ్యక్షుడు సురేష్ రెడ్డి , మండ ల జనసేన మహిళ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పొన్న యుగంధర్

వైభవంగా ఉగాది వేడుకలు

జిడి నెల్లూరులో

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల కేంద్రం లో ఆర్‌టిఐ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలు వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూని య న్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డీకే కుమార్, యూనియన్ సలహాదారు డాక్టర్ తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో సాధారణ పౌరుడు ప్రభుత్వ పరంగా ఎలాంటి వివరాలు సేకరించుకోవాలన్నా ఆర్‌టిఐ సమాచార హక్కు చట్టం తోనే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం సభ్యులు ఉగాది సంబరాలు నిర్వహించి ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఐ యూనియన్ నేతలు గిరిబాబు, జయరాజ్, సభ్యులు హేమచంద్ర, లోకనాథ్ నాయుడు, కోదండ రెడ్డి, స్టీఫెన్, నీలావతి వెంకటేష్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలస్వామి విగ్రహానికి పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష అభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరు మంజనం చేపట్టారు. అనంతరం ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు రమేష్, శభరీష్, గోపాలస్వామి, షరాబ్ బాబు, సురేష్, టీటీడీ సిబ్బంది పలువురు, పాల్గొన్నారు.

కార్వేటినగరం షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టు వస్త్ర, సుగంధ పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించారు. గాజుల నాగేశ్వరరావు దంపతులు ఉభయదారులుగా వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలాజీ, కమిటీ సభ్యులు, చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

సోమల: ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం మండలంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. పంచాంగ శ్రవణాన్ని వినిపించి పంటలు బాగా పండుతాయని, వర్షాలు కురుస్తాయని రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటల నుండి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిపై అధిష్టింపజేసి భజనలు కోలాటాలతో గ్రామంలో ఊరేగించారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు యువకుడు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని శేషాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రామ చంద్రారెడ్డి కథనం మేరకు గంగాధర నెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ నాసాంపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ కుమారుడు శివయ్య (21) జయంతి గ్రామం నుండి బంగారుపాళెంకు ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శివయ్య తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందా డు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బంగారుపాలెం ఆస్పత్రి కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లారీ ఢీకొని మృతి చెందిన రాజేశ్వరి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని పాల ట్యాంకరు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మొగలిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు తవణంపల్లి మండలం అరగొండ పైమాగంకు చెందిన చంద్రశేఖర్ శెట్టి, రాజేశ్వరి , జ్యోతికలు ద్విచక్ర వాహనంలో మొగిలికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. రోడ్డును దాటుతున్న సమయంలో లారీ ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్వరి (48) లారీ టైర్ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందింది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి . రాజేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నం చేసుకున్న గణేష్

ప్రజాశక్తి -కార్వేటినగరం: వ్యక్తి అనుమాస్పద స్థితిలో ఆత్మహత్యా యత్నం చేసు కున్న సంఘటన మండల పరిధిలోని చింతమండి వద్ద ఉన్న మామిడి తోటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలం లోని సీడీ కండ్రిగకు చెందిన దాసరి గణేష్ భవనిర్మాణ కాంట్రాక్టరుగా పనులు చేసుకుంటూ జీవనం గడిపేవారు. అయితే సోమవారం సాయంత్రం చింత మండి సమీపంలో రోడ్డుపై అతని ద్విచక్రవాహనాన్ని ఆపి అక్కడే ఉన్న ఓ మామిడి తోటలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. గుర్తించిన స్థానికులు అతనిని కార్వేటినగరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందిస్తు న్నారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ హనుమంతప్ప , ఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేసున్నారు.

చంద్రశేఖర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -పూతలపట్టు : పూతలపట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చిత్తూరు ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాదులోని ఇమేజ్ హాస్పిటల్లో సోమవారం ఉదయం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇందులో భాగంగా ఆయనను ఆస్పత్రికి తరలించారు. పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, మండల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ నేతాజీ తదితరులు మౌనం పాటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిర్యాని సెంటర్ దగ్ధం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని బిర్యాని సెంటర్ సోమవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. స్థానికుల కథనం మేరకు..బిర్యాని సెంటర్ లోపల ప్రమాద వశాత్తు మంటలు వ్యాపించ డంతో అక్కడ వంటకు ఉపయోగించే ముడి సరుకులు కట్టెలు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని బిరియాని సెంటర్ యజమాని తెలిపారు. పరిసరాల్లోని యువకులు సమీపంలోని నీటిని అందించి మంటలు అదుపు చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామం అజాఖానా జహరాలో ఖురాన్ సందేశాన్ని, ఈద్గా వద్ద ఉపవాసం గురించి మతగురువు మౌలానా అబిదాలీ , నబీల్ రజ, మౌలానా మహమ్మద్ కుమేల్ వివరించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్, అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు నియాజ్ అలీ, అబ్బాసియా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రహమత్ అలీ, షియా ముస్లిం పెద్దలు ఇక్బాల్ హుస్సేన్, జాఫర్ అలీ, షాకిర్, మహాదుఅలీ, హషక్ అలీ, బాబు , జాఫర్ అలీ, చాన్ ది అలీ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం వేపేరిలో ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ఈద్గాల వద్దకు సోమవారం ఉదయం7.30 కే వెళ్లారు. నెల రోజులు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు, నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ పండుగను వాడవాడలా జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలు పచ్చికాపల్లం, తాటిమాకులపల్లి, పాత గుంట గ్రామాలలో ఈద్గాకు చేరుకుని ఒకరికొకరు ఆప్యాయంతో ఆలింగనం చేసుకుని ప్రార్థనలు చేశారు.

కార్వేటినగరంలో

కార్వేటినగరం: సోమవారం మండల కేంద్రంలోని మసీదు లో ముస్లిం సోదరులు చిన్నపెద్ద తేడా లేకుండా రంజాన్ సందర్భం గా నూతన దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నా రు. పేదలకు దాన ధర్మాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో భాగంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటా ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపు కున్నారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రంజాన్ పండుగ విశేషాలను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బంగారుపాళెం: దానధర్మాల పండగ రంజాన్ అని ముత్తవల్లి నూర్ మహమ్మద్ అన్నారు. మండలంలోని పాలేరు ఈద్గా వద్ద రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు ఇస్లామిక్ మతపరమైన బోధనలు వినిపించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల మండల కేంద్రంలోని స్థానిక ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ పండుగను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకొని సంతోషంగాపండుగను జరుపు కున్నారు.

సోమల: సోమల, కందూరు, నవాబు పేట, వంగసాని వారి పల్లి, నంజంపేట ,పెద్ద ఉప్పరపల్లి, ఇరికిపెంట గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు మసీదు నుండి ర్యాలీగా బయలుదేరి ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని పేదలకు వస్త్రాలు, నగదు, తీపి మిఠాయిలు పంచిపెట్టారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం తురకపేట లోని ఈద్గా మైదానంలో మైనారిటీ సోదరులు రంజాన్‌ను ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కుప్పం రూరల్‌లో

కుప్పం రూరల్ : పట్టణంతోపాటు గ్రామాలలో సైతం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ వేడుకలలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి ఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు హాజరై రంజాన్ విశిష్టతను వివరించి ముస్లిం సోదర సోదరీమణు లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, బెండనకుప్పం బాబు, రాజారామ్, మంజునాథ్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజకుమార్, నియోజకవర్గం మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, షాదీ మహల్ మాజీ అధ్యక్షులు అన్సర్ భాష, నాయకులు కదిరప్ప, ప్రమోద్, బాలాజీ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: స్థానిక గిరింపేట ఈద్గాలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీల నేతలు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

యాదమరి వేడుకల్లో ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి: పూతలపట్టు నియోజక వర్గ వ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలను ముస్లి సోదరులు జరుపు కున్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరిం చుకుని యాదమరి మండ లం, 14 కండ్రిగ ముస్లీం వాడలో ముస్లిం సోదరు లతో కలిసి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవిత్ర ప్రార్థన, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు, చిన్నారులకు స్వీట్లు పంచి పెడుతూ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మైనారిటీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల ను ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, సీనియర్ నాయకులు అమరనాథ్ నాయుడు, విజయేందర్ యాదవ్, గ్రామ పెద్దలు, ముస్లీం మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.